సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం ¦ 20 ¦ ఫిబ్రవరి ¦ 2024



బెల్ట్ షాపులపై చర్యలేవి?
పెద్దమ్మతల్లి ఆలయం చుట్టూ గల్లీగల్లీకో బెల్టుషాపు ఏర్పాటు చేసి, విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేపడుతున్నారు. 8లో



పువ్వర్తిలో వైద్యశిబిరాలు..
దండకారణ్యంలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజు సోమవారం తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 20°

వాతావరణం
జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం జరుపుతున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

భక్తులకు అసౌకర్యాలు కలగొద్దు

ఎమ్మెల్యే కోరం కనకయ్య



జాతర ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కోరం

ఇల్లెందురూరల్: వనదేవతల జాతరలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. మండలంలోని బొజ్జాయిగూడెం సమీప అటవీ ప్రాంతంలో ఈ నెల 21 నుంచి సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహించనుండగా, ఏర్పాట్లను సోమవారం ఎమ్మెల్యే కోరం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతర ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులు స్నానం చేసేందుకు ట్యాపులు అమర్చాలన్నారు. ఎంపీడీఓ ధన్‌సింగ్, రజియాబేగం, జాతర నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సమావేశం

చుంచుపల్లి: జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రసునారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

విధుల్లో చేరిన ఎంవీఐలు, ఏఎంవీఐలు

కొత్తగూడెంటౌన్: జిల్లా రవాణాశాఖలో నలుగురు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు(ఎంవీఐలు), ఇద్దరు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐలు)లు సోమవారం విధుల్లో చేరారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని జిల్లాకు బదిలీ చేస్తూ రవాణాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల నుంచి బదిలీపై వచ్చిన ఎంవీఐ వెలసరి వెంకట రమణ కొత్తగూడెం ఆర్టీఓ కార్యాలయంలో విధుల్లో చేరారు. సత్తుపల్లి నుంచి వచ్చిన సంగం వెంకటపుల్లయ్య అశ్వారావుపేటలో, సిద్దిపేట నుంచి వచ్చిన టీ.జనార్దన్‌రెడ్డి అశ్వారావుపేటలో, కొమరంభీం ఆసిఫాబాద్ నుంచి వచ్చిన టి.కిషన్‌రావు భద్రాచలంలో ఎంవీఐలుగా బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డి నుంచి వచ్చిన జె.ఎస్.శ్రీనివాసరావు అశ్వారావుపేటలో, పెద్దపల్లి నుంచి వచ్చిన ఉమర్ ఫారుఖ్‌ను పాల్వంచలో ఏఎంవీఐలుగా బాధ్యతలు చేపట్టారు. కాగా ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన జిల్లా రవాణాశాఖ అధికారి పి.వేణు స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

25 నుంచి విజయ సంకల్ప యాత్ర

చుంచుపల్లి: మూడోసారి కేంద్రంలో అధికారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి విజయ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగా కిరణ్ తెలిపారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భద్రాచలంలో యాత్ర ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ హాజరవుతారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెర్వు శ్రీనివాసరావు, చుంచుపల్లి మండల అధ్యక్షులు రాయుడు నాగేశ్వరరావు, సుజాతనగర్ మండల అధ్యక్షులు భూక్యా రాజేష్ నాయక్, కొమ్ము వంశీ కుమార్, గొడుగు శ్రీధర్, బాల వెంకట్ రెడ్డి, జతంగి కృష్ణ,పానుగంటి లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్కా.. నువ్వే సూడాలే!





నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు స్వీకరిస్తున్న రామచంద్రయ్య, అభినందిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన రేగా కాంతారావు, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్(ఫైల్)

వనదేవతల వీరగాథలు చెప్పే 'సకిని'

- రామచంద్రయ్యకు 2022లో పద్మశ్రీ ప్రకటించిన కేంద్రం
- ఆ తర్వాత రాష్ట్రప్రభుత్వం తరఫున రూ.కోటి ఆర్థిక సాయం ప్రకటన
- రెండేళ్లు గడిచినా నేటికీ నెరవేరని హామీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రెండేళ్ల క్రితం సకిని రామచంద్రయ్య పేరు ఊరూవాడ మార్మోగింది. నిరక్షరాస్యుడైనా తనలో దాగి ఉన్న కళతో కేంద్రాన్ని మెప్పించి పద్మశ్రీ అవార్డుకు ఎంపికయ్యాడు. అతని ప్రతిభకు మెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇంటిస్థలంతోపాటు నిర్మాణానికి రూ.కోటి ఆర్థిక సాయం ప్రకటించింది. అయితే నేటికీ ఆ హామీలు అమలుకు నోచుకోలేదు. ఆ సమ్మక్క తల్లి అయినా కరుణించి తన సమస్య తీర్చాలని రామచంద్రయ్య కోరుతున్నారు.

'కంచు' కంఠం ఆయన సొంతం

మణుగూరు మండలం కూనవరం గ్రామానికి చెందిన సకిని రామచంద్రయ్య ఆదివాసీ సంస్కృతిలో భాగమైన కంచు మేళం, కంచు తాళం (డోలు వాయిద్యం) సాయంతో వనదేవతల వీరగాథలు చెప్పడంలో దిట్ట. ముఖ్యంగా రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర సందర్భంగా సమ్మక్క, సారలమ్మ, గోవింద రాజులు, పగిడిద్దరాజుల వంటి ఆదివాసీల దేవేరుల కథను కళ్లకు కట్టినట్టుగా గానం చేస్తారు. మేడారం జాతర సందర్భంగా చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెలపైకి తీసుకొచ్చేప్పుడు ఆయన కీలకంగా వ్యవహరిస్తారు. రామచంద్రయ్య ప్రతిభను గుర్తించిన కేంద్రం 2022 జనవరి 25న పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఈ సత్కారం అందుకున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అప్పటి సీఎం కేసీఆర్ స్పందించారు. 2022 ఫిబ్రవరి 1న రామచంద్రయ్యను ప్రగతి భవన్‌కు పిలిపించుకుని మాట్లాడారు.

వృద్ధాప్య పింఛనే దిక్కు

ప్రభుత్వం ప్రకటించిన సాయాన్ని అమలు చేయాలని కోరుతూ రెండేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పద్మశ్రీ రామచంద్రయ్య ఫైల్‌కు మోక్షం లభించడం లేదు. ఎట్టకేలకు గత డిసెంబర్‌లో కొత్తగూడెంలో 426 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించేందుకు సర్వే చేశారు. ఇంకా పత్రాలు మాత్రం ఇవ్వలేదు. రామచంద్రయ్యతోపాటు పద్మశ్రీ పురస్కారాలు పొందిన కిన్నెర మొగిలయ్య, గుస్సాడి కనకరాజుకు ఇంటి స్థలంతోపాటు కోటి రూపాయల ఆర్థిక సాయం అప్పటికప్పుడే అందింది. కానీ రామచంద్రయ్య విషయంలోనే జాప్యం జరుగుతోంది. కనీసం కళాకారులకు అందించే రూ.10,000 పింఛన్ సైతం ఆయనకు అందడం లేదు. గతంలో ఈ విషయంపై తెలంగాణ సాంస్కృతిక సారథికి పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. రెండెకరాల పొలం, రూ.రెండు వేల వృద్ధాప్య పింఛన్‌పైనే ఆధారపడి రెండు గదుల ఇందిరమ్మ ఇంట్లో ఆయన జీవిస్తున్నారు.

అప్పు చేసి ఆస్పత్రికి..

రామచంద్రయ్య ఇటీవల అనారోగ్యం పాలయ్యారు. దీంతో హైదరాబాద్ తీసుకెళ్లి వైద్యం చేయించేందుకు ఆ కుటుంబం రూ.4 లక్షల వరకు అప్పు చేయాల్సి వచ్చింది. కంచు తాళం, కంచు మేళంతో ఆదివాసీ కథలు చెప్పే ఏకైక కళాకారుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం సకిని రామచంద్రయ్య ఒక్కరే ఉన్నారు. అలాంటి కళాకారుడికి అండగా నిలవడంలో జరుగుతున్న జాప్యానికి ఇకనైనా స్వస్తి పలకాలని ఆయన అభిమానులు కోరుతున్నారు.

అందని ఇంటి స్థలం, రూ.కోటి నగదు

రామచంద్రయ్య కుటుంబ ఆర్థిక స్థితిగతులపై కేసీఆర్ ఆరా తీశారు. ఆదివాసీ కళలు అంతరించి పోకుండా కాపాడుతున్నందుకు మెచ్చుకున్నారు. అప్పటికప్పుడు జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఇంటి స్థలం కేటాయిస్తామని చెప్పారు. స్థలం ఇచ్చినా ఇల్లు కట్టుకునే ఆర్థిక స్థోమత లేదని చెప్పడంతో ఇంటి నిర్మాణానికి రూ.కోటి ఆర్థిక సాయాన్ని స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా ప్రభుత్వం తరఫున అందిస్తామని ప్రకటించారు. స్వయానా ముఖ్యమంత్రి నుంచి హామీ రావడంతో రామచంద్రయ్య సంతోషించారు. కానీ, ఆ హామీల అమలులో ఇప్పటికీ జాప్యం జరుగుతూనే ఉంది.

హామీ నెరవేర్చండి

ఆర్థిక సాయం కోసం రెండేళ్లుగా తిరుగుతూనే ఉన్నాం. కలెక్టర్ ఖాతాలో డబ్బులు జమ అయ్యాయని చెబుతున్నారు. వాటిని మాకు అందివ్వాలంటే ఫైనాన్స్ సెక్రటరీ నుంచి అనుమతి రావాలంటున్నారు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రస్తుత కలెక్టర్ ప్రియాంక ఆల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా ఇంటి స్థలం విషయంలో సర్వే నిర్వహించారు. ఆర్థిక సాయం విషయాన్ని ఫైనాన్స్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఆర్థిక సాయం అందివ్వాలి.

– పద్మశ్రీ సకిని రామచంద్రయ్య

వీగిన అవిశ్వాసం



మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు

- కోరంలేక వీగిపోయిందని ఆర్డీఓ వెల్లడి
- 36 మంది సభ్యులుండగా సమావేశానికి ఒక్కరే హాజరు
- చైర్‌పర్సన్‌గా కొనసాగనున్న సీతాలక్ష్మి
- కొత్తగూడెం మున్సిపాలిటీలో ఉత్కంఠకు తెర

కొత్తగూడెంఅర్బన్: ఉత్కంఠ రేపిన అవిశ్వాసం వీగిపోయింది. నాలుగు రోజులుగా వ్యూహరచన చేస్తున్న చైర్‌పర్సన్‌వర్గం పైచేయి సాధించింది. కొత్తగూడెం మున్సిపల్ పాలకవర్గంలో 36 మంది కౌన్సిలర్లు ఉండగా, వారిలో 22 మంది గత నెల 23న కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం కాపీని అందించారు. అప్పటినుంచి ఇరువర్గాలు వ్యూహప్రతివ్యూహాలతో పావులు కదిపాయి. చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి వర్గం పలువురు కౌన్సిలర్లను నాలుగు రోజుల ముందే గోవా క్యాంపునకు తరలించారు.

ఒకే ఒక్కరు హాజరు..

కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన బలపరీక్షకు చైర్‌పర్సన్‌వర్గంలో ఒక్కరు మినహా మిగిలినవారెవ్వరూ హాజరు కాలేదు. ఆమె వర్గానికి చెందిన 28వ వార్డు కౌన్సిలర్ మండల ఆమని ఒక్కరే మధ్యాహ్న సమయంలో మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. సమావేశానికి హాజరైనట్లు సంతకం చేసి, వెంటనే బయటకు వెళ్లిపోయారు. ఇటీవల కాంగ్రెస్ కండువాలను కప్పుకున్న, అవిశాస్వం పెట్టిన సభ్యులు కూడా బలపరీక్షకు హాజరుకాలేదు. కాగా ప్రత్యర్థి వర్గం కౌన్సిలర్లు భవిష్యత్‌లో కోర్టుకు కూడా వెళ్లే అవకాశం లేకుండా చైర్‌పర్సన్ వర్గం చెక్ పెట్టినట్లు తెలుస్తోంది. అందుకే ఆమె వర్గం నుంచి ఒకరు హాజరైనట్లు సమాచారం.

కోరంలేక వీగిపోయింది : ఆర్డీఓ

మధ్యాహ్నం 2 గంటల దాకా అధికారులు సమయం ఇచ్చినా 25 మంది సభ్యులు హాజరుకాకపోవడంతో కోరం పూర్తికాలేదు. దీంతో చైర్‌పర్సన్‌పై 22 మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయిందని కొత్తగూడెం ఆర్డీఓ మధు వెల్లడించారు. సీతాలక్ష్మే చైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు.

భారీ పోలీసు బందోబస్తు

బలపరీక్ష నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఉదయం 8 గంటలకే చేరుకున్న పోలీసులు కార్యాలయం, ప్రధాన ద్వారం వద్ద బందోబస్తు నిర్వహించారు. వన్‌టౌన్, టూ టౌన్, చంద్రుగొండ, చుంచుపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. బలపరీక్ష ప్రత్యేక అధికారి ఆదేశాల మేరకు ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలోకి ఎవరినీ అనుమతించలేదు. 36 మంది కౌన్సిల్ సభ్యులు, 14 మంది సిబ్బందిని మాత్రమే అనుమతించాలని నిర్ణయించారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు, మున్సిపల్ ఆవరణలో ఉన్న మీ సేవకు వచ్చే ప్రజలు, పని చేసే సిబ్బందిని కూడా లోపలికి అనుమతించలేదు. దీంతో 14 మంది మున్సిపల్ సిబ్బంది తప్ప మిగతా వారు అంతా మున్సిపల్ కార్యాలయం ముందున్న చెట్లు, నీడ ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకు వేచి ఉన్నారు.

త్వరలో కాంగ్రెస్ గూటికి చైర్‌పర్సన్ వర్గం..?

అవిశ్వాసం పెట్టిన వర్గంవారు ఇటీవల కాంగ్రెస్ కండువాలను కప్పుకుని మరింత బలాన్ని పెంచుకునే దిశగా ప్రయత్నించినా సఫలం కాలేకపోయారు. దీంతోవారి వర్గం నుంచి కూడా ఎవరూ బలపరీక్షకు రాలేదు. చైర్‌పర్సన్‌తో పాటు ఆమెతో ఉన్న కౌన్సిల్ సభ్యులు కూడా త్వరలోనే కాంగ్రెస్ గూటికి చేరతారనే ప్రచారం సాగుతోంది. అందుకే చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయేలా కాంగ్రెస్‌లోని కీలకనేత పావులు కదిపినట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే మున్సిపల్ కౌన్సిల్‌లో మళ్లీ రెండువర్గాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

వారి ఆశలు అడియాసలే..



స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తగూడెంలో ప్రజాస్వామ్యమే గెలిచిందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ పదవి దక్కించుకోవాలని ప్రయత్నం చేసిన వారి ఆశలు అడియాసలు అయ్యాయని పేర్కొన్నారు. పాలకవర్గంలో 28 మంది తనకే మద్దతు పలికారని తెలిపారు. అనంతరం అభిమానులు, నాయకులు మున్సిపల్ కార్యాలయం వద్ద, రామవరంలో స్వీట్లు పంపిణీ చేశారు. బాణసంచాను కాల్చి సంబురాలు జరుపుకున్నారు. నాయకులు షరీఫ్, సూరిబాబు, మైనుద్దీన్, దొమ్మేటి నాగేశ్వరరావు, ఖాజా, షేక్ యాకుబ్ పాషా, దిబ్బ మధుసూదన్ పాల్గొన్నారు.

22న సైన్స్ టాలెంట్ టెస్ట్

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 22వ తేదీన జిల్లా స్థాయిలో 9వ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్, తెలంగాణ బయలాజికల్ సైన్స్ టీచర్స్ జిల్లా బాధ్యులు తెలిపారు. సోమవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తామని, ప్రతి పాఠశాల నుంచి ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. పాల్గొనే విద్యార్థులు వారి పాఠశాలల భౌతికశాస్త్ర, జీవశాస్త్ర ఉపాధ్యాయుల ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఫోరమ్ బాధ్యులు ఏ.నాగరాజశేఖర్, ఎస్.కే.సైదులు, జి.అనురాధ, ఏ.శంకర్, టి, మాధవరావు, సిహెచ్ సునందిని, ఏ. విజయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో కలెక్టర్ ప్రియాంక



ప్రజావాణిలో సమస్యలు వింటున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజా దర్బార్‌కు కూడా 38 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తుదారులకు ఏడు రోజుల్లోగా నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికలను సీఎం కార్యాలయానికి పంపినట్లు వివరించారు.

వీసీకి హాజరైన కలెక్టర్

ఓటరు టర్న్‌అవుట్ పెరిగేలా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. హైదరాబాద్ నుంచి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా నుంచి హాజరైన కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న ఓటరు నమోదు కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీఓలు మధు, మంగీలాల్, ఇల్లెందు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎలక్షన్ సిబ్బంది నవీన్, నియోజకవర్గ కేంద్రాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

మేడారం బయల్దేరిన పగిడిద్దరాజు

ఇలవేల్పును ఊరేగింపుగా తీసుకెళ్తున్న అర్రెం వంశీయులు



గద్దెల వద్ద ప్రదక్షిణ చేస్తున్న పూజారులు

గుండాల: వన దేవత సమ్మక్క భర్త, యాపలగడ్డ గ్రామం అర్రెం వంశీయుల ఇలవేల్పు పగిడిద్దరాజు సోమవారం మేడారం బయల్దేరాడు. గుండాల మండలంలోని యాపలగడ్డలో సోమవారం పగిడిద్దరాజు గర్భగుడి వద్ద పడగలకు(జెండాలకు), శివసత్తులకు, ఆభరణాలకు పూజారులు, వడ్డెలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పగిడిద్దరాజును గద్దెల వద్దకు తీసుకెళ్లి పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులు, హిజ్రాలు నృత్యాలు చేశారు. పడగలను, నగలు, గజ్జెలు ధరించిన వడ్డెలు ఊరేగింపుతో కాలినడకన మేడారం బయల్దేరారు. ఆదివాసీ నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించుకుంటూ తీసుకెళ్లారు. మేడారం వెళ్లే భక్తులు సైతం యాపలగడ్డ వద్ద పగిడిద్దరాజును దర్శించుకుని వెళ్లారు. కాగా బుధవారం పగిడిద్దరాజును మేడారంలోని గద్దెలకు వద్దకు చేర్చుతామని, దీంతో సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభమవుతుందని అర్రెం వంశీయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెలు, పూజారులు అర్రెం అప్పయ్య, బుచ్చయ్య, లక్ష్మీనర్సు, చిన్న కాంతారావు, సత్యం, జోగయ్య, ఇద్దయ్య, పెద్ద కాంతారావు, నాగేశ్వరావు, సమ్మయ్య, ముత్తయ్య, భిక్షం రమేష్, నాగేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు కావలెను..

- భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో సగానికిపైగా ఖాళీలు
- ఉన్నవారిలోనే కొందరు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు..
- నర్సింగ్ విభాగంలోనూ వెంటాడుతున్న సిబ్బంది కొరత
- ఏజెన్సీ ప్రభుత్వాస్పత్రుల్లో గిరిజనులకు అందని వైద్యం



భద్రాచలం ఆస్పత్రి (ఇన్‌సెట్) వార్డులో విధులు నిర్వర్తిస్తున్న ఒకే ఒక్క నర్సింగ్ స్టాఫ్

భద్రాచలం: ప్రభుత్వాస్పత్రులను వైద్యులు, సిబ్బంది కొరత వెంటాడుతుండగా, ఏజెన్సీ ప్రజలకు సరైన వైద్యం అందడంలేదు. గిరిజనులకు మెరుగైన వైద్యసేవలందిస్తామనే హామీలు ప్రసంగాలకే పరిమితమవుతున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న భద్రాచలం ఏజెన్సీలో వైద్య సేవల దుస్థితి మారడంలేదు. ఏరియా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పోస్టుల కేటాయింపు తప్ప భర్తీ ప్రక్రియ చేపట్టడంలేదు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే స్థోమత లేక, ప్రభుత్వాస్పత్రిలో పూర్తిస్థాయిలో వెద్య సేవలు అందక గిరిజనుల ప్రాణాలు గాల్లోనే కలిసిపోతున్నాయి.

207 పోస్టులకు 90 ఖాళీ..

200 పడకలు, వివిధ అత్యాధునిక విభాగాలు ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఖాళీలు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. ఆస్పత్రిలో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, అడ్మినిస్ట్రేటివ్ విభాగాల్లో మొత్తం 207 పోస్టులు ఉండగా, ప్రస్తుతం రెగ్యులర్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన 117 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 90 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. 69 డాక్టర్ పోస్టులు ఉండగా, కేవలం 17 మంది రెగ్యులర్, 23 మంది కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. మరో 29 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నర్సింగ్ పోస్టులు 53 ఉండగా, 17 మంది రెగ్యులర్, ఆరుగురు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఇంకా 30 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. మిడ్ వైఫ్ సిస్టర్స్ రెండింటికి రెండు, ల్యాబ్ టెక్నీషియన్లు ఏడింటిలో నాలుగు.. ఇలా అన్ని విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. దుమ్ముగూడెం పీహెచ్‌సీలో నాలుగింటికి మూడు స్టాఫ్ నర్స్ పోస్టులు, నర్సాపురం పీహెచ్‌సీలో రెండు నర్సింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చర్ల పీహెచ్‌సీలో ఏడు ఏఎన్‌ఎంలు, స్టాఫ్ నర్స్, ఎంపీహెచ్‌ఏ పోస్టులు, సత్యనారాయణపురంలో ఐదు పోస్టులు భర్తీ కాలేదు.

సత్వరం నియామకాలు చేపడితే మేలు..

జీఓ నంబర్ 317 ద్వారా అత్యధికంగా 17 మంది నర్సింగ్ సిబ్బంది బదిలీపై వెళ్లారు. కొందరిని డిప్యూటేషన్‌పై పంపించారు. అధికారులు ఇష్టానురీతిన స్వలాభం కోసం డిప్యూటేషన్‌పై పంపిస్తున్నారంటూ ఆదివాసీలు, ఆదివాసీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది కొరత ఏర్పడి భద్రాచలం ఆస్పత్రిలో వైద్య సేవలందడంలేదని 'సాక్షి'లో వరుసగా కథనాలు ప్రచురితమవుతుండగా అధికారుల్లో చలనం మొదలైంది. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఐదుగురి డిప్యూటేషన్‌ను రద్దు చేసి, తిరిగి ఆస్పత్రికి రప్పించారు. బదిలీపై వెళ్లిన 17 మందిలో కొందరిని స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సుతో డిప్యూటేషన్‌పై తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇవన్నీ కంటితుడుపు చర్యలేగానే మిగిలిపోతున్నాయి. బదిలీల తర్వాత ఏర్పడ్డ ఖాళీల్లో డిప్యూటేషన్ లేదా కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టకుండా ఉన్నతాధికారులు జాప్యం చేస్తున్నారు. భర్తీ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. వార్డులో పదుల సంఖ్యలో రోగులు ఉండగా, సిబ్బంది ఒక్కరు కూడా లేని పరిస్థితి నెలకొంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఏజెన్సీవాసులు కోరుతున్నారు.

అసలే కొరత.. అయినా డిప్యూటేషన్లు

భద్రాచలం ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది పోస్టుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ, ఉన్న వారిలో కొందరిని ఇతర ఆస్పత్రులకు డిప్యూటేషన్‌పై పంపడం గమనార్హం. 69 డాక్టర్ పోస్టులకు 40 మంది ఉండగా, వారిలో 13 మంది వైద్యులను డిప్యూటేషన్‌పై పంపించారు. మణుగూరు, ఇల్లెందు తదితర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వీరిని జిల్లా ఉన్నతాధికారులు డిప్యూటేషన్‌పై కేటాయించారు. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడంలేదు. పనిభారం పెరగడంతో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసేందుకు కూడా వైద్యులు ముందుకు రావడంలేదు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన అధికారులు



కలెక్టర్ ప్రియాంకకు మొక్క అందజేస్తున్న బాబూరావు, తిరుపతయ్య

సూపర్‌బజార్ (కొత్తగూడెం): జిల్లా వ్యవసాయాధికారిగా వి.బాబూరావు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన తిరుపతయ్య సోమవారం కలెక్టర్ ప్రియాంక అలను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళాలు


దాతలకు రశీదు ఇస్తున్న అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్న దాన కార్యక్రమానికి పలు ప్రాంతాల భక్తులు సోమవారం విరాళాలు అందజేశారు. భద్రాచలంలోని తాతగుడి సెంటర్‌కు చెందిన ఎం.సుశీల, రామఅమృతరావు రూ.లక్ష, చెన్నైలోని శ్రీనివాసపురం కాలనీకి చెందిన వీకే రఘునాథన్ రూ.1,00,001ను ఆలయ అధికారులకు అందించగా వారు దాతలకు రశీదు ఇచ్చి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎల్.సాయిబాబా, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కొబ్బరి రైతుల సమావేశం

అశ్వారావుపేటరూరల్: కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటుపై ఇటీవల రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి లేఖ రాసిన నేపథ్యాన బుధవారం కొబ్బరి రైతుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ కొబ్బరి రైతుల సంఘం బాధ్యులు ఆలపాటి రాము, కొక్కెరపాటి పుల్లయ్య తెలిపారు. అశ్వారావుపేటలోని రైతు వేదిక ఆవరణలో బుధవారం ఉదయం 11 గంటలకు సమావేశం మొదలవుతుందని పేర్కొన్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు ఆవశ్యకత, రాయితీలు, సమస్యలపై చర్చించనున్నందున సాగుదారులు హాజరుకావాలని కోరారు.

సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించాలని డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన సూచించారు. సోమవారం ఆమె మణుగూరు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంత్‌సేవాలాల్ జయంతి నిర్వహణకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

వైద్యసిబ్బందికి శిక్షణ

కొత్తగూడెం రూరల్: జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్‌లో హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌లో హెచ్ఐవీ, ఆర్టిఐ,ఎస్‌టీఐ కేసుల నమోదుపై సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ జేవీఎల్ శిరీష, ఇతర అధికారులు, డీపీఓ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి కల్యాణానికి ఏర్పాట్లు


పసుపురాట వేస్తున్న భక్తులు

చర్ల: మండలంలోని తేగడలో గల శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉత్సక కమిటీ ఆధ్వర్యంలో పసుపురాట వేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఇక్కడ ఏటా ఎల్లమందీయ వంశీయుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎనగంటి చంద్రశేఖర్ – ఉమ దంపతులు.. వారి తల్లిదండ్రులు వెంకట ఉమామహేశ్వరరావు, కాంతమ్మ జ్ఞాపకార్థం ఆలయ ముఖద్వార నిర్మాణం కోసం రూ.1,51,116 విరాళంగా ఇచ్చారు. నిర్మాణానికి సంబంధించి భూమి పూజ కూడా చేశారు. శ్రావణ్‌కుమార్, శివప్రతాప్, వీరభద్రస్వామి, చక్రవర్తి, ప్రవీణ్‌కుమార్, ముకేశ్, రోహిత్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

బెల్ట్ షాపులపై చర్యలేవి?

- పెద్దమ్మతల్లి గుడి చుట్టూ బెల్ట్‌షాపులే..
- ఆలయ సమీపంలోని ప్రత్యేక గదిలో సిండికేట్ దుకాణం


పెద్దమ్మగుడి వద్ద బెల్టుషాపులో మద్యం సేవిస్తున్న వ్యక్తులు

పాల్వంచరూరల్: నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అధికారంలోకి రాగానే బెల్టుషాపులను ఎత్తివేస్తామని ఎన్నికల సమయంలో విస్తృత ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోకపోవడంతో పెద్దమ్మతల్లి ఆలయం చుట్టూ గల్లీగల్లీకో బెల్టుషాపు ఏర్పాటు చేసి, మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. ఆలయం చుట్టూ దాదాపు 200 పైన బెల్టుషాపులున్నాయి. అంతేకాకుండా 36 గ్రామ పంచాయతీల్లోనూ బెల్టుషాపులు ఏర్పాటు చేశారు.

నాడు గుడుంబా..

పాల్వంచ అంటేనే ఒకప్పుడు గుడుంబా ఉత్పత్తికి, విక్రయాలకు పెట్టింది పేరు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లోనూ, గిరిజన గ్రామాల్లో, తండాల్లో గుండుంబా తయారు చేసేవారు. దీనిపై అప్పటి ప్రభుత్వ సహకారంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, మహిళలు గుడుంబాపై పోరాటాలు చేసి, గుడుంబా తయారీ, విక్రయాలను సంపూర్ణంగా అరికట్టారు. అనంతరం గ్రామగ్రామాన బెల్టుషాపులను నెలకొల్పడంతో మద్యం విచ్చలవిడిగా లభిస్తుండటంతో అనేక నిరుపేద కుటుంబాలు మద్యం మత్తులో జోగుతున్నాయి.

అధిక ధరలతో దోపిడీ..

స్ట్రాంగ్ బీరు ఎంఆర్‌పీ రూ.160 ఉంటే రూ.220 పైన విక్రయిస్తున్నారు. లైట్ బీరు ఎంఆర్‌పీ రూ.150 ఉంటే రూ.210 చొప్పున, వివిధ రకాల మద్యం క్వార్టర్ల ధరలు రూ.170 ఉంటే రూ.220పైన రూ.300 ఉంటే రూ.320పైన, 130 ఉంటే రూ.150పైన.. విక్రయిస్తున్నారు. ఇలా అన్ని రకాల మద్యం, బీర్ల ధరలు పెంచి మద్యం ప్రియులను దోపిడీ చేస్తున్నారు.

సిండికేట్ దుకాణం ఏర్పాటు


సిండికేట్ షాపు వద్ద బారులుదీరిన బెల్టుషాపుల నిర్వాహకులు

పెద్దమ్మగుడి సమీపంలో వైన్‌షాపు నిర్వాహకులు ప్రత్యేక గదిలో మద్యం నిల్వలు పెట్టి అక్కడి నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని బెల్టుషాపులకు ఎంఆర్‌పీ కంటే అదనంగా రూ.10 నుంచి రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో తాము అదనంగా మరో రూ.20 పెంచి విక్రయించాల్సి వస్తోందని బెల్టు షాపు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ దందా అంతా ఎక్సైజ్, పోలీసు అధికారుల కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు తెలుస్తోంది. వారికి నెలనెలా మామూళ్లు అందుతున్నట్లు సమాచారం.

బెల్టుషాపులు తొలగించాలి



పెద్దమ్మగుడి వద్ద విచ్చలవిడిగా బెల్టుషాపులను ఏర్పాటు చేశారు. గల్లీగల్లీకో బెల్టు దుకాణం ఉంది. అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నారు. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి బెల్టుషాపులను అరికట్టాలి.

– బాదర్ల నాగేశ్వరరావు, పెద్దమ్మగుడి

అప్పుల పాలవుతున్నారు..



రోజురోజుకూ బెల్టుషాపులను ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నిరుపేద కుటుంబాలు అప్పులపాలవుతున్నాయి. నీళ్ల దొరకని గ్రామాలున్నాయిగానీ, మద్యం దొరకని ఊరు లేదు. వెంటనే బెల్టుషాపులను మూసివేయాలి.

– గద్దల రమేశ్, దంతలబోరు, ఎస్సీకాలనీ

చర్యలు తీసుకుంటాం

ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయించే మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. పెద్దమ్మగుడి వద్ద, గ్రామీణ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బెల్టు దుకాణాలపై దాడులు చేస్తాం. నేను ప్రస్తుతం మేడారం విధుల్లో నిమగ్నమై ఉన్నాను. అక్కడి నుంచి రాగానే చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్, ఎక్సైజ్ సీఐ, పాల్వంచ

కాంగ్రెస్ పెద్దలను కలిసిన పొదెం


దీపదాస్‌మున్షితో పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొదెం వీరయ్య సోమవారం హైదరాబాద్‌లో పలువురు కాంగ్రెస్ పార్టీ పెద్దలను కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపదాస్‌మున్షిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మోతుకూరి ధర్మారావు, ఏనుగుల అర్జున్‌రావు, భద్రం, రామ్‌లక్ష్మణ్, తంగెళ్ల లక్ష్మణ్, కాసుల వెంకట్, రజాక్, కొండలు, శ్రీరాములు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం నిర్వాహకుడికి జరిమానా?

పాల్వంచ: అధిక ధరలకు మద్యం విక్రయిసున్న వైన్స్ షాపు నిర్వాహకుడికి ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు జరిమానా విధించినట్లు తెలిసింది. రు. పాల్వంచలో అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారంతో హైదరాబాద్‌కు చెందిన స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సోమవారం తనిఖీలు చేశారు. ఈ క్రమంలో నటరాజ్ సెంటర్ వద్ద గల ఓ వైన్స్ షాపులో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు తేలడంతో రూ.5 లక్షలు జరిమానా విధించారని, ఓ బెల్ట్ షాపు నిర్వాహకుడికి రూ.20 వేలు జరిమానా విధించినట్లు సమాచారం. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

రెండు గ్రామాల ప్రజల మధ్య వాగ్వాదం

రసాభాసగా శివాలయ ప్రతిష్ఠాపనపై నిర్వహించిన సమావేశం


పెద్దమ్మగుడి వద్ద జరిగిన సమావేశంలో ప్రజలు

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) సముదాయంలో రూ.74 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న శివాలయం ప్రతిష్ఠాపన కోసం సోమవారం నిర్వహించిన సమావేశం రెండు గ్రామాల ప్రజల మధ్య వాగ్వాదానికి వేదికైంది. గత బుధవారం ఆలయం వద్ద ఈఓ ఎన్.రజనీకుమారి, పాలకవర్గం, గ్రామస్తులతో నిర్వహించిన సమావేశం కూడా రసాభాసగా మారింది. సోమవారం జరిగిన సమావేశంలో కేశవాపురం గ్రామస్తులు ఈ నెల 29న ప్రతిష్ఠాపన చేయడానికి అంగీకరించగా జగన్నాథపురం గ్రామస్తులు వ్యతిరేకించారు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో మంగళవారం మరోసారి పాలకవర్గం, రెండు గ్రామాల ప్రజలతో కలిసి సమావేశం నిర్వహిస్తామని ఈఓ రజనీకుమారి తెలిపారు.

ఆపన్నహస్తం అందించండి..


నగదు అందిస్తున్న దాతలు

దుమ్ముగూడెం: మండలంలోని రామారావుపేటకు చెందిన నిరుపేద పొడియం రాంబాబు (36) పొలం పనులకు వెళ్లి గట్టు మీది నుంచి కాలు జారి కింద పడ్డాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి వెన్నెముక దెబ్బతిందని, శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. దీనికి గాను రూ.4.50 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. వారి దగ్గర అంత స్తోమత లేదు. అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాడు. తండ్రి మూడేళ్ల కిందటే చనిపోయాడు. తల్లి వెంకటనర్సమ్మ అన్నీ తానై సాకుతోంది. రాంబాబు పీజీ వరకు చదువుకున్నాడు. కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసి కుటుంబాన్ని పోషించాడు. ప్రస్తుతం దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. కాగా, స్థానిక బ్యూటీఫుల్ లైఫ్ అసోసియేషన్ వారి సాయం కోరగా స్పందించిన నిర్వాహకులు వారింటికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పి బీఎల్ఎఫ్ తరఫున రూ.2 వేలు అందించారు. విషయాన్ని బీఎల్ఏ సపోర్టర్స్ అయిన విజయవాడకు చెందిన డెర్మోకేర్ ఆస్పత్రి యాజమాన్యానికి (రాజీవ్, ప్రవీణ) వివరించారు. వారు స్పందించి రూ.20 వేలు బీఎల్ఏ ఫోన్‌పే ద్వారా అందించారు. సాయం అందించాల్సినవారు బాధిత కుటుంబం ఫోన్ నంబరు 93813 35897లో సంప్రదించాలి. నగదు అందించినవారిలో బీఎల్ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామల రవివర్మ, కణితి రాముడు, తామ రాజు, వర్సా విష్ణు, బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్పెల్ విజర్డ్ – డ్రామా పోటీలకు ఎంపిక

తిరుమలాయపాలెం: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా)ఆధ్వర్యాన సోమవారం ఖమ్మంలోని ఎన్నెస్పీ ప్రభుత్వ పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి స్పెల్ విజర్డ్ – డ్రామా పోటీలు నిర్వహించారు. రెండు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు జెడ్పీహెచ్ఎస్, అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనబర్చి హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఖమ్మం డైట్ అధ్యాపకుడు వైజీకే.మూర్తి, పద్మ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కె.శరత్‌బాబు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు ఎల్టా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు జె.జగదీష్, ఎస్.కే.దస్తగిరి ప్రశంసాపత్రాలు అందజేసి మాట్లాడగా ఎన్నెస్పీ పాఠశాల హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు ఎల్టా బాధ్యులు వై.వెంకటేశ్వరరావు, ఎస్.రవికుమార్, రామనాథం, మీరా హుస్సేన్, ఎం.డీ. ముజీబ్, ఎం.డీ.షఫీ ఎన్.నాగేశ్వరరావు, సైదులు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ షాప్‌లో కేటీపీఎస్ సొత్తు


పట్టుబడిన స్క్రాప్

పాల్వంచ: కేటీపీఎస్‌కు చెందిన సామగ్రి ఓ పాత ఇనుప దుకాణంలో పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు పాల్వంచలోని దమ్మపేట సెంటర్‌లో ఉన్న పాత ఇనుప దుణాణంలో జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ రమేశ్ ఆధ్వర్యాన సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు రూ.40 వేల విలువైన కేటీపీఎస్ సామగ్రి లభించింది. ఇది కేటీపీఎస్ ఓఅండ్ఎం స్టోర్స్ నుంచి తరలించినట్లు అనుమానిస్తున్నారు. అయితే, సామగ్రి బయటకు ఎలా వెళ్లింది? దీని వెనుక ఎవరి హస్తం ఉందనే కోణంలో విచారణ చేస్తున్నారు. ఈ విషయమై డీఎస్పీ రమేశ్‌ను వివరణ కోరగా కొంత సామగ్రి లభించిన మాట వాస్తవమేనని, పూర్తి విచారణ అనంతరం మంగళవారం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

- ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల దుశ్చర్య


మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన వ్యక్తి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. దంతెవాడ జిల్లా మాలేవాహి పోలీస్‌స్టేషన్ పరిధి పల్లి – బూర్సార్ ప్రధాన రహదారిపై ఘెటియా సమీపంలోని మూలమలుపు వద్ద ఇన్‌ఫార్మర్ నెపంతో గొంతు కోసి హతమార్చిన గిరిజనుడి మృతదేహాన్ని మావోయిస్టులు ఆదివారం రాత్రి పడేశారు. ఆయన మృతదేహం వద్ద వదిలిన లేఖలో పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందు వల్లే హతమార్చామని, ఎవరైనా సరే ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తే ఇదే శిక్ష విధిస్తామంటూ హెచ్చరించారు. కాగా, మావోయిస్టుల చేతిలో హతమైన వ్యక్తి ఆచూకీ తెలియరాలేదు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సోమవారం ఉదయం మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న మాలేవాహి పోలీసులు పంచనామా అనంతరం ఆస్పత్రి మార్చురీలో భద్రపరచారు.

గాయపడిన యువకుడు మృతి


శ్రీనివాసరెడ్డి (ఫైల్)

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లిబంజర గ్రామ సమీపంలో ఈ నెల 15వ తేదీన మోటార్‌సైకిల్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు సోమవారం మృతిచెందాడు. బూర్గంపాడు మండలంలోని నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామానికి చెందిన యడమకంటి శ్రీనివాసరెడ్డి అలియాస్ గాంధీ (24) పెద్దమ్మగుడి వద్ద జరిగిన స్నేహితుడి వివాహానికి వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో మోటార్‌సైకిల్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. మోటార్ సైకిల్ వెనుక కూర్చున్న మరో యువకుడు సందీప్‌కు గాయాలయ్యాయి. వారిని భద్రాచలం ఏరియాస్పత్రికి తరలించారు. శ్రీనివాసరెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు తిరిగి భద్రాచలం ఏరియాస్పత్రికి తీసుకొచ్చారు. సోమవారం తెల్లవారుజామున యువకుడు మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనతో నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో విషాదం అలుముకుంది.

లారీ బోల్తా


బోల్తాపడిన లారీ

పాల్వంచరూరల్: ఓవర్‌లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని కేశవాపురం వద్ద సారపాక ఐటీసీ పరిశ్రమకు తీసుకెళ్తున్న జామాయిల్‌కర్ర లోడు లారీ బోల్తాపడింది. కర్రలు రోడ్డుపై పడిపోవడంతో కొంతసేపు రాకపోకలకు ఇబ్బంది కలిగింది. లారీలో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

ద్విచక్రవాహనదారుడిపై కేసు

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనంతో ఢీకొట్టి, ఓ వ్యక్తిని గాయపర్చిన ద్విచక్ర వాహనదారుడిపై స్థానిక పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన మాలోతు భిక్షం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. దీంతో భిక్షం కాలుకు దెబ్బతగిలింది. క్షతగాత్రుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు ద్విచక్రవాహనదారుడు చండ్రుగొండ మండలం మద్దుకూరు గ్రామానికి చెందిన రావుల వెంకటకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పకడ్బందీగా ఎస్సెస్సీ ప్రీ ఫైనల్ పరీక్షలు

గిరిజన దర్బార్‌లో అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్


గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్

భద్రాచలం: వచ్చేనెల 1వ తేదీ నుంచి జరగనున్న ఎస్సెస్సీ ప్రీ ఫైనల్ పరీక్షలను గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్ అధికారులకు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌కు ఆయన శిక్షణలో భాగంగా హాజరయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలను ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్‌తో కలిసి స్వీకరించారు. అనంతరం ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేసి అర్హతల మేరకు వాటిని పరిష్కరించాలని సూచించారు. ఆ తర్వాత మయాంక్‌సింగ్ మాట్లాడుతూ.. పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు కీలకమని తెలిపారు. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు, అధికారులు సురేశ్‌బాబు, మునీర్‌పాషా, భాస్కరన్, రమణయ్య, ఆర్.శ్రీనివాస్, ఆదినారాయణ, నరేశ్‌కుమార్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

మెరుగైన వైద్య సేవలందించాలని సూచన


వైద్య సేవలపై మహిళను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రధానాస్పత్రి వైద్యులు, సిబ్బందిపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన ఆస్పత్రిని సందర్శించారు. అన్ని వార్డులు, డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు, మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డుల్లో, ఆస్పత్రి ఆవరణలో విద్యుత్ దీపాలు, రోగుల సంఖ్యకు అనుగుణంగా ఫ్యాన్లు ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 900 మంది ఇన్‌పేషెంట్లు సేవలు పొందుతున్న ఆస్పత్రిలో సౌకర్యాలపై నిర్లక్ష్యం వహించడం సరికాదని హెచ్చరించారు. జిల్లా ఆస్పత్రిలో సరైన వైద్యసేవలు అందడంలేదని ఆరోపణలు వస్తున్నాయని, దీన్ని సరిచేసుకోవాలని సూచించారు. ఆస్పత్రికి అంబులెన్సు సౌకర్యంతోపాటు మరో ఐదు డయాలసిస్ యంత్రాలను తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. కూనంనేని వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, డీసీహెచ్ఎస్ ఎస్ రవిబాబు, డీఎంహెచ్‌ఓ శిరీష, ఆర్ఎంఓ పుష్పలత, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబిర్‌పాషా, స్థానికులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ఎస్ కె ఫహీమ్, గద్దం ప్రభాకర్, యు హరీష్, సత్యనారాయణ, ఖయూమ్ తదితరులు పాల్గొన్నారు.

పువ్వర్తిలో కొనసాగుతున్న వైద్యశిబిరాలు


వివరాలు సేకరిస్తున్న బెటాలియన్ ఉద్యోగులు

చర్ల: దండకారణ్యంలోని గ్రామాల్లో ఆదివాసులకు విద్య, వైద్యంతో పాటు అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఈ క్రమంలోనే క్యాంపులను ఏర్పాటు చేస్తూ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతమైన పువ్వర్తిలో పోలీస్ క్యాంపును ఏర్పాటు చేసిన అనంతరం గ్రామంలో ఆదివారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఆదివాసీ కుటుంబాలతో పాటు మావోయిస్టు మోస్ట్ వాంటెడ్ సెంట్రల్ కమిటీ సభ్యుడు మడివి హిడ్మా, పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ కమాండర్ బార్సె దేవా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దంతెవాడ రేంజ్ డీజీపీ కమలోచన్ కశ్యప్, సుకుమా సీఆర్‌పీఎఫ్ డీఐజీ అరవింద్‌రాయ్, బీజాపూర్ సుకుమా జిల్లాల ఎస్పీలు జితేంద్రకుమార్‌యాదవ్, కిరణ్‌చౌహాన్ నేతృత్వంలో బీజాపూర్, సుకుమా జిల్లాలోని అటవీ ప్రాంత గ్రామాల్లో క్యాంపులను ఏర్పాటు చేశామని, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని సుందర్‌రాజు తెలిపారు. దంతెవాడ, సుకుమా, బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటనలో వివరించారు.